క్లుప్తంగా

పాఠశాలలో టీడీపీ సమావేశం



బాపట్ల: పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయలకు దూరంగా ఉంచాలనే నిబంధనలను సైతం తెలుగుదేశం పార్టీ బాపట్ల నాయకులు విస్మరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల్లి శ్రీనివాసరావు ఏకంగా ప్యాడిసన్‌పేట ప్రాథమిక పాఠశాలలో టీడీపీ వార్డు సమావేశం నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. పార్టీ స్థానిక నాయకులు అందరితో జరిగిన ఈ సమావేశం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించటం బాపట్లలో చర్చానీయాంశమైంది.

పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్లు అందజేత



నిజాంపట్నం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి చెప్పారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో విధులు నిర్వహిస్తున్న 20 మంది పారిశుద్ధ్య కార్మికులకు గురువారం పంచాయతీ కార్యాలయంలో శానిటేషన్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. శానిటేషన్ కిట్లు ధరించి విధులకు హాజరుకావాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజల సహకారం అవసరమని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ వరి విత్తనాలతో రైతులకు లబ్ధి

కొల్లూరు : రాయితీపై ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వరి విత్తనాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గురువారం కొల్లూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న మేలు రకం వరి విత్తనాలను సాగుకు వినియోగించుకొని రైతులు అధిక దిగుబడులు సాధించాలని కోరారు. మండలంలోని బీపీటీ-5204 రకం 240 క్వింటాళ్లు సబ్సిడీపై అందజేయడానికి అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏవో వి.నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణాధికారులు ఎం.ప్రభాకరరావు, బి.నిపున్‌వంశి, వీఏఏలు, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందజేయాలి

కర్లపాలెం: నాణ్యమైన పెట్రోల్, డీజిల్ విక్రయించి వాహన వినియోగదారుల మన్ననలు పొందాలని బాపట్ల జిల్లా రవాణా శాఖాధికారి టి.పరందామరెడ్డి చెప్పారు. కర్లపాలెంలో భారత్ పెట్రోల్ బంక్‌ను నూతనంగా ప్రారంభించిన సందర్భంగా వినియోగదారులకు అందించిన కూపన్లకు గురువారం లాటరీ నిర్వహించారు. జిల్లా రవాణా శాఖాధికారి పరందామరెడ్డి లాటరీ తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. షణ్ముఖ ఫ్యూయల్ స్టేషన్ నిర్వాహకులు వెంకట సురేష్, నాయకులు పందరబోయిన సుబ్బారావు, తాండ్ర సాంబశివరావు, మండపాటి పరమానందకుమార్, ఆట్ల హరిబాబురెడ్డి ఉన్నారు.

కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేయాలి



వేమూరు: కౌలు రైతులకు కార్డులు త్వరగా అందజేయాలని ఏవో ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులు వల్ల ప్రభుత్వం పథకాలు పొందడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు ఉపయోగపడుతుందన్నా రు. కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని ఆయన సూచించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు నిర్మించిన ప్రహరీ గోడ ప్రారంభం



అమర్తలూరు(వేమూరు): పాఠశాలల అబివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం పూర్తిగా ఉండాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982–83 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.2.30 లక్షలతో ఆట స్థలం, అసంపూర్తిగా ఉన్న ప్రహరీ గోడ నిర్మించడం జరిగిందన్నారు. పూర్వ విద్యార్థి శివకుమార్ రూ.1.25 లక్షలతో మీటింగ్ హాల్‌లో విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కనపర్తి నిరీక్షణరావు, మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్, తహసీల్దారు నెహ్రూబాబు, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, కనపాల రమేష్, విద్యా కమిటీ చైర్మన్ వినయ్‌బాబు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రం

- మండలంలోని ప్రధాన కూడళ్లలో పనిచేయని సీసీ కెమెరాలు
- నేరాల కట్టడికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు
- పట్టించుకోని పోలీసులు.. అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు



వేమూరు చావలి రోడ్డులో పని చేయని సీసీ కెమెరా

వేమూరు: మండలంలో నేరాలను అరికట్టేందుకు, అలాగే పలు కేసులను ఛేదించడంలో సులువుగా ఉండేందుకు, నేర పరిశోధనకు పలు ప్రాంతాలలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల(నిఘా నేత్రాలు)ను ఏర్పాటు చేశారు. దీంతో పోలీసులకు పలు కేసుల పరిష్కారంలో అవి ఉపయోగపడుతున్నాయి. అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను చాలా వరకు కట్టడి చేయవచ్చు. రోడ్లపై నిత్యం జరుగుతున్న నేరాలను గుర్తించేందుకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు సంవత్సరాలు క్రితం పలు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొదట్లో ఇవి బాగానే పని చేశాయి. రానురాను పోలీసులు పట్టించుకోకపోవడంతో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వేమూరు మండలంలోని వేమూరు, జంపని, చావలి ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొంత కాలంగా పోలీసులు పట్టించుకోక సీసీ కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు పేరుకు ప్రజలకు ఉపయోగంగా కనపడుతున్నాయి. కానీ ప్రస్తుతం అవి పనిచేయక నిరుపయోగంగా మారాయి.

ప్రత్యేక నిఘా టీమ్‌ల ఏర్పాటు

ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం గుర్తు తెలియని దుండగులు మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిన ఘటన వేమూరులో జరిగింది. అన్నే పార్వతి తన ఇంటి ముందు రోడ్డుపై ఊడుస్తోంది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న గుర్తు తెలియని ఇద్దరు దుండగులు మహిళ మెడలో నాలుగు సవర్ల బంగారం గొలుసు లాక్కెళ్లారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో పోలీసులు తల బాదుకుంటున్నారు. సీసీ కెమెరాలు ఉపయోగంలో ఉండి ఉంటే బంగారం గొలుసు లాక్కెళ్లిన దుండగలను పట్టుకోవడం పోలీసులకు సులభంగా ఉంటుంది. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో దుండగలను పట్టుకొనేందుకు ప్రత్యేక నిఘా టీమ్‌లను ఏర్పాటు చేశారు.

+ మండలంలోని వివిధ ప్రధాన కూడళ్లలో నిరుపయోగంగా మారిన సీసీ కెమెరాలను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సీసీ కెమెరాలు పని చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని, వాటిని అందుబాటులోకి తేవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సీసీ కెమెరాలు పని చేస్తే నేరస్తులను గుర్తించడం సులభతరమవుతుందని, అలాగే దొంగతనాలు కూడా తగ్గుతాయని, పోలీసులు సీసీ కెమెరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

రెండు రోజుల్లో ఉపయోగంలోకి



ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వాటిని బాగు చేయిస్తాం. రెండు రోజుల్లో అన్ని ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలు ఉపయోగంలోకి తీసుకొని రావడం జరుగుతుంది.

– జి.శ్రీనివాసరరావు, ఎస్ఐ, వేమూరు.

ఆషాడ మాసంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు



ఎస్ఎస్‌పీ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ

రేపల్లె: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆషాడ మాసంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ చెప్పారు. చెరుకుపల్లి మండలం గూడవల్లి గౌడపాలెంలోని రామాలయంలో గురువారం నిర్వహించిన ధార్మిక సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆషాడ మాసం ఎంతో విశిష్టమైందని చెప్పారు. ఈ మాసంలో చాతుర్మాస్య దీక్ష ప్రారంభమవుతుందన్నారు. ఈ మాసంలో వచ్చే గురు పౌర్ణమి రోజున గ్రామగ్రామాన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆడపడుచు గోరింటాకు పెట్టుకునే విధంగా ప్రోత్సాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ దేవతలకు పసుపు కుంకుమ సారె సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమ శంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, రాయన్న నాగబాబు, కేసన్న నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అవసరం

ఆర్డీవో రామలక్ష్మి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అవసరమని ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణ ఆదర్శ వేదిక అవగాహన కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను ఆమె గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కేవలం చైతన్య కార్యక్రమాలకే పరిమితమవకుండా మొక్కలను నాటి వాటి పెంపకం బాధ్యతలు చేపట్టాలని ఆదర్శ వేదిక సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక సభ్యులు యడ్లపల్లి కిషోర్‌బాబు, డీవీ మోహనరావు, జీ సాంబశివరావు, కొడాలి ఆనందరావు, ఎం.నాంచారయ్య, ఎన్.సాయికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీడీపీవో సుచిత్ర



రేపల్లె: రేపల్లె ఐసీడీఎస్ సెక్టారు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించినట్లు సీడీపీవో ఎం.సుచిత్ర తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రేపల్లె సెక్టారు పరిధిలో ఒక అంగన్‌వాడీ, 5 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పట్టణంలోని 5వ వార్డు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ సెంటరులో అంగన్‌వాడీ టీచర్ పోస్టుకై ఓపెన్ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ వార్డు కౌంటివారివీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు ఓసీ కేటగిరి, జేఎల్‌బీ కాలేజీ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాకు ఓపెన్ కేటగిరి, పిరాట్లంక 1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాకు ఓపెన్ కేటగిరి, నగరం మండలం పెద్దవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ కేటగిరి, సిరిపూడి 1 అంగన్‌వాడీ కేంద్రంలో బీసీ-బీ కేటగిరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తకు దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి, ఆయాకు దరఖాస్తుకు చేసుకునే వారు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి గ్రామ పరిధిలో నివాసం కలిగి ఉండి, వివాహిత మహిళై ఉండాలన్నారు. వయసు 2025 జులై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని చెప్పారు. ఈ నెల 27వ తేదీ నుంచి జులై 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రేపల్లెలోని ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టుకు భర్తీకి ప్రకటన విడుదల

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అమర్తలూరు పరిధిలోని అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేయడం జరిగిందని సమగ్ర శిశు అభివృద్ధి అధికారి లక్ష్మీదేవి తెలిపారు. అమర్తలూరు ప్రాజెక్ట్ పరిధిలోని వేమూరు, అమర్తలూరు, చుండూరు, కొల్లూరు మండలాల్లోని గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని చెప్పారు. అమర్తలూరు మండలంలోని యడవూరు-2 బీసీ(డి), మోపర్రు-2, ఎస్సీ, వేమూరు మండలంలోని చావలి-3(ఓసీ)పెరవలి-3 బీసీ(డి), పెరవలిపాలెం-1 ఓసీ, జంపని-2, ఎస్సీ, భట్టిప్రోలులోని అంగన్‌వాడీ కేంద్రం-1 2, బీసీ(డి) కొల్లూరు మండలంలోని క్రాప-1 ఓసీ, దోనేపూడి కేంద్రం-2, ఎస్సీ కొల్లూరు-1, ఎస్సీ, చుండూరు మండలంలోని యడ్లపల్లి-1 ఓసీ, వలివేరు-1 ఎస్సీ, తొట్టెంపూడి-2, ఎస్సీ కేటాయించడం జరిగిందన్నారు. జులై 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థులు 7వ తరగతి పాసై, 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని ఆమె చెప్పారు.

మలేరియా నివారణపై అవగాహన సదస్సు



మోపర్రు జెడ్పీ హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

అమర్తలూరు(వేమూరు): దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని తెనాలి పట్టణం మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ అన్నారు. అమర్తలూరు మండలం మోపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మలేరియా నివారణ మాసోత్సవ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా.. కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. 2027 నాటికి మలేరియా కేసులను జీరోకు తీసుకొని రావడం జరుగుతుందన్నారు. ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. హెచ్ఎం వాకా నాంచారయ్య, మోపర్రు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి పని చేయాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమయ్యేలా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ కోరారు. గుళ్ళపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి కమిటీల నియామకాలను పూర్తి చేయాలన్నారు. సమర్థవంతమైన నాయకులను కమిటీలో ఎన్నుకోవాలన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపునిచ్చేలా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అసమర్థతతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా మేనిఫెస్టోను అమలు చేయకపోగా ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సమావేశంలో రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల కన్వీనర్లు మేడికొండ అనిల్, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రాంబాబు, దుండి వెంకటరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

కలసికట్టుగా అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో ఎలీషాబాబు

పిట్టలవానిపాలెం (కర్లపాలెం): అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా అభివృద్ధి సాధించాలని పిట్టలవానిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు చెప్పారు. మండల పరిషత్ వైస్ ఎంపీపీ దొంతిరెడ్డి సింధు అధ్యక్షతన గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలని చెప్పారు. తమ గ్రామంలో తాగునీరు సక్రమంగా రావటం లేదని పంచాయతీ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అల్లూరు ఎంపీటీసీ వాలి కృష్ణకుమారి తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో జరిగే కార్యక్రమాల గురించి తమకు తెలియజేయటం లేదని చల్లాపల్లి విజయరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు షేక్ బాజీ, కత్తి కుమారి, గంగయ్య, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, పీఆర్ఏఈ రఘు, ఎంఈవో రాజారత్నం తదితరులు హాజరయ్యారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఎంపీడీవో బి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నగరం: విద్యార్థులు చదువుకునే వయసులో ఆల్కహాల్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించకుని నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం దెబ్బతిని మానసిక రోగులుగా మారతారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. తొలుత విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి నగరం మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను వ్యతిరేకించాలి

వేమూరు: విద్యార్థులు మత్తు పదార్థాలను పూర్తిగా వ్యతిరేకించాలని తహసీల్దారు సుశీల అన్నారు. మండల తహసీల్దారు కార్యాలయం వద్ద మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత జీవితాలు కోల్పోతున్నారన్నారు. కావున యువత మత్తు పదార్థాలను వ్యతిరేకించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మిద్దాం: ఎంపీడీవో

కర్లపాలెం: మాదక ద్రవ్యాలు లేని స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మించుకుందామని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా గురువారం మండల విద్యా వనరుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన జీవితం అంధకారమవుతుందని అన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుందరమ్మ, ఎంఈవో విజయశ్రీ, సూపరింటెండెంట్ రజని, కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



ముత్తాయపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థుల

బాపట్లటౌన్: మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చిత్తు అవుతుందని కోస్టల్ సెక్యూరిటీ సీఐ టి.లక్ష్మణారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని ముత్తాయపాలెం, సూర్యలంక గ్రామాల్లో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని దాని సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం ముత్తాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, ఎయిర్‌ఫోర్స్ కేంద్రియ విద్యాలయం విద్యార్థులతో ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పి.నాగశివారెడ్డి, ఎ.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్ళు, హోం గార్డులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినయోగంపై ఉక్కుపాదం అవసరం



కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, సిబ్బంది

కొల్లూరు : మాదకద్రవ్యాల వినియోగం ఇటీవల కాలంలో అధికమవుతున్న తరుణంలో వాటిని అరికట్టడానికి పోలీసు శాఖ ఉక్కుపాదం మోపడం అవసరమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. గురువారం మాదకద్రవ్యాల నివారణా దినోత్సవం పురస్కరించుకొని కొల్లూరులో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆయన మాట్లాడుతూ, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకుండా పోలీసు శాఖ వాటి నిర్మూలనపై దృష్టి సారించాలని సూచించారు. తొలుత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో కొల్లూరు ప్రధాన వీదుల్లో అవగాహనా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, వేమూరు, చుండూరు సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.నరసింహారావు, కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు ఎస్ఐలు జానకీ అమరవర్ధన్, శ్రీనివాసరావు, రవికృష్ణ, రెహమాన్, శివయ్య, మాజీ ఎంపీపీలు మధుసూదన్ ప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేమూరు తహసీల్దారు కార్యాలయం వద్ద డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీలో రెవెన్యూ సిబ్బంది



కొల్లూరులో మాదకద్రవ్యాల నివారణపై ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



కొల్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, పోలీసు, ఇతర శాఖల అధికారులు

విశిష్ట పురస్కార్ అవార్డు అందుకున్న పోలీస్‌రావు



కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పోలీస్‌రావు

కర్లపాలెం: రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు జిల్లా కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా విశిష్ట పురస్కార్ అవార్డును అందుకున్నారు. పలు రంగాలలో విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి గురువా రం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విశిష్ట పురస్కార్ అవార్డులను కలెక్టర్ వెంకటమురళి అందజేశారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల అధ్యక్షుడిగా చేసిన పలు సేవలకు గుర్తింపుగా తనకు విశిష్ట పురస్కార్ అవార్డును కలెక్టర్ అందజేశారని పోలీస్‌రావు తెలిపారు.